

ఆశలు నింపిన డిండి

నల్లగొండ జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుల్లో ఒకటైన డిండి ప్రాజెక్టు నిండుకుండలా మారింది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.50 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,50,257 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 2,09,248 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,313 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 7,086 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 2,210 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,611 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 1,269 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

ఐటీఐ కళాశాలల్లో 4వ దశ అడ్మిషన్లు

రామగిరి(నల్లగొండ): ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి మిగిలిన సీట్లకు ఈ నెల 20వ తేదీ వరకు 4వ దశ స్పాట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ నర్సింహాచారి మంగళవారం తెలిపారు. 20వ తేదీ లోపు iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే 1, 2, 3 ఫేజ్‌లలో నమోదు చేసుకున్న వారు మళ్లీ నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా అప్లికేషన్ ప్రింటెడ్ కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంబంధిత కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99489 47670 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు థర్మల్ పవర్‌ప్లాంట్‌కు డిప్యూటీ సీఎం

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని థర్మల్ పవర్‌ప్లాంట్‌కు బుధవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రానున్నట్లు పవర్‌ప్లాంట్ సీఈ సమ్మయ్య మంగళవారం తెలిపారు. పవర్‌ప్లాంట్ పనుల పురోగతిని సమీక్షించి, రెండవ యూనిట్ ట్రయల్ రన్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు నల్లగొండకు ఎంపీ ఈటల రాజేందర్

నల్లగొండ టూటౌన్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించేందుకు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నల్లగొండ పట్టణానికి రానున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. యువత బీజేపీ సభ్యత్వం తీసుకుని దేశ భవిష్యత్‌కు నాంది పలకాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

మిర్యాలగూడ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని ఆలగడప పీహెచ్‌సీని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెరిగేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గీతావాణి, సీహెచ్‌ఓ మోతీలాల్, హెచ్‌ఈఓ ప్రభాకర్, డాక్టర్ మోయిద్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు యడవల్లి విద్యార్థి



కార్తీక్

కనగల్: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కనగల్ మండలంలోని జి.యడవల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కార్తీక్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దొడ్డి విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ నారాయణ కవిత మంగళవారం తెలిపారు. ఈ నెల 14నుంచి 16వరకు వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో కార్తీక్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు కార్తీక్‌ను అభినందించారు.

చేనేతలకు రుణమాఫీ ప్రకటనపై హర్షం

నల్లగొండ: చేనేత పారిశ్రామికులు, కార్మికులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించడంతో చేనేత పారిశ్రామిక నిధి ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి రాపోలు దత్త గణేష్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేనేత రుణాలను మాఫీ చేస్తామనడంతో పాటు వారిని ఆదుకునేందుకు మహిళా సంఘాలకు ప్రతి ఒక్కరికీ సంవత్సరానికి రెండు చీరలు, చేనేత కార్మికుల ద్వారా నేసిన చీరనే అందించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొనడం చేనేత కార్మికుల్లో ఆనందం నింపిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చేనేత పారిశ్రామికులు, చేనేత కార్మికుల కుటుంబాలకు మేలు జరుగుతుందని, అందుకు సహకరించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.



చాకలి ఐలమ్మకు నివాళి

తెలంగాణ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు తదితరులు

– నల్లగొండ టూటౌన్

నష్టం విలువ రూ.4కోట్లు

వరద నష్టంపై అంచనా వేసిన అధికారులు



తిరుమలగిరి(సాగర్): లక్ష్మీపురంతండాలో కురిసిన వర్షాలకు నీట మునిగిన పత్తి చేను



దేవరకొండ: మంగలోనిబావి వద్ద వర్షానికి దెబ్బతిన్న రోడ్డు

- ఆగస్టు నెలాఖరు నుంచి జిల్లాలో వర్షాలు
- పొంగిన, వాగులు వంకలు..
- నష్టం అంచనాల నివేదికను ప్రభుత్వానికి పంపిన అధికారులు

నల్లగొండ: వరుసగా కురిసిన వర్షాలతో జిల్లాలో కొంతమేర నష్టం జరిగింది. ఆగస్టు చివరి వారం నుంచి మొదలైన వర్షాలు ఈ నెల మొదటి వారం వరకు దంచికొట్టాయి. ఎడతెరిపి లేని వర్షాలతో జిల్లాలో వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పాటు కొన్ని చోట్ల రోడ్లు దెబ్బతినడం, ఇళ్లు కూలిపోవడం, చందంపేట మండలంలో ఒక మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వర్షం మిగిల్చిన నష్టంపై అధికారులు అంచనా వేశారు. జిల్లాలో రెవెన్యూ, మత్స్య శాఖ, వ్యవసాయ శాఖలతో పాటు రోడ్లు భవనాల శాఖ , పంచాయతీరాజ్ రోడ్లు, విద్యుత్ శాఖ , విద్యా శాఖ భవనాలు దెబ్బతిన్నాయి. ఈ ఆరు శాఖలకు ఆస్తినష్టం జరిగింది.

◆ రెవెన్యూ శాఖ..

చందంపేట మండలం తెల్దేవరపల్లిలో మన్నెం బుచ్చమ్మ ఈ నెల 1న భారీ వర్షాలతో కొండ చరియలు విరిగిపడి మరణించింది. ఆమె కుటుంబానికి కలెక్టర్ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. పూర్తిగా దెబ్బతిన్న ఒక గృహానికి 1.30 లక్షలు, అధిక శాతం దెబ్బతిన్న మరో మూడు గృహాలకు 1.30 లక్షలు, మరో 2 గృహాలకు 1.30 లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న 97 గృహాలకు ఒక్కో దానికి రూ.6500 చొప్పున పరిహారం ప్రకటించారు.

వ్యవసాయ శాఖకు..

జిల్లాలో 500 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతినగా దాని విలువ రూ.43.53 లక్షలుగా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అదేవిధంగా రాష్ట్ర రహదారులు 59.87 కిలోమీటర్లు దెబ్బతినగా.. రూరల్ ప్రాంతాల్లో 29.70 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. బ్రిడ్జిలు, కల్వర్టులు రెండు చోట్ల దెబ్బతిన్నాయి. దీంతో ఆ శాఖలో మొత్తం రూ.49.28 లక్షల ఆస్తి నష్టం జరిగింది.

◆ మత్స్య శాఖకు..

భారీ వర్షాల కారణంగా 305 చేపల వలలు దెబ్బతిన్నాయి. ఒక్కో దానికి రూ.4 వేల చొప్పున 12. 20 లక్షల నష్టం జరిగింది.

◆ పంచాయతీరాజ్ శాఖలో..

పంచాయతీరాజ్ శాఖలో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు, రోడ్డు బ్రీచ్‌లు, బ్రిడ్జిలు దెబ్బతినడంతో 27.18 లక్షల నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

◆ విద్యుత్ శాఖ..

విద్యుత్ శాఖలో 100 స్తంభాలు దెబ్బతిన్నాయి. కండక్టర్ వైర్ 7 కిలోమీటర్ల పరిధిలో దెబ్బతినగా 11కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 3 చోట్ల దెబ్బతిన్నాయి. దీంతో మొత్తం విద్యుత్ శాఖ పరిధిలో 8.90 లక్షల నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

◆ విద్యా శాఖ..

వర్షాలకు పాఠశాల భవనాలు దెబ్బతినడంతో విద్యాశాఖకు రూ.లక్షా 60వేల నష్టం జరిగింది. భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఈ ఆరు శాఖల పరిధిలో మొత్తం రూ.4,06,89,500 నష్టం జరిగినట్లు జిల్లా యంత్రాంగం అంచనాలు సిద్ధం చేసింది. నష్టం నివేదికలను అధికారులు ప్రభుత్వానికి పంపారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పిస్తాం

- కలెక్టర్ నారాయణరెడ్డి



జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రామగిరి(నల్లగొండ): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్ర లైబ్రరీని ఆయన పరిశీలించి, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. లైబ్రరీలో సౌకర్యాలు ఎలా ఉన్నాయని.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య ఉందని, టాయిలెట్లను సరిగా శుభ్రం చేయటం లేదని, వర్షం వచ్చినప్పుడు నీరు లైబ్రరీ ఆవరణలోకి వస్తోందని, లైబ్రరీ సమయాన్ని రాత్రి 10 గంటల వరకు పొడిగించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా పారిశుద్ధ్య సిబ్బందిని తక్షణమే నియమించాలని లైబ్రేరియన్‌ను ఆదేశించారు. అభ్యర్థులు చదువుకునేందుకు వీలుగా లైబ్రరీని మహిళా అభ్యర్థులకు రాత్రి 9 గంటల వరకు, పురుష అభ్యర్థులకు 10 గంటల వరకు పొడిగించాలని సూచించారు. లైబ్రరీకి తక్షణమే 20 ర్యాక్‌లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా మొరం పోయించాలని అధికారులను ఆదేశించారు. కాగా.. లైబ్రరీ సెక్రటరీ, సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు అభ్యర్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా.. సిబ్బంది దురుసు ప్రవర్తనను మానుకోవాలని, మరోసారి ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైటింగ్ ప్యాడ్స్ కావాలన్న అభ్యర్థుల కోరిక మేరకు 100 రైటింగ్ ప్యాడ్స్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని సీసీని ఆదేశించారు.

వల్లభరావు చెరువు వద్ద ఏర్పాట్ల పరిశీలన

రామగిరి(నల్లగొండ): వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయనున్న నల్లగొండ జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువును కలెక్టర్ నారాయణరెడ్డి ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి సందర్శించారు. ఈ నెల 16న గణేశ్ నిమజ్జనం నిర్వహిస్తుండగా ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వల్లభరావు చెరువుతోపాటు, 14వ మైలురాయి, నాగార్జునసాగర్ బ్రిడ్జి కింద, ఇతర ప్రాంతాలతోపాటు, విగ్రహాల నిమజ్జనం జరిగే అన్ని ప్రదేశాల్లో క్రేన్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీఎస్ఈకి సూచించారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. తాగునీటి చెరువుల్లో విగ్రహాలు నిమజ్జనం చేయకుండా ఇతర ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఆర్అండ్‌బీఎస్ఈ సత్యనారాయణ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి తదితర అధికారులు ఉన్నారు.

నిమజ్జన ప్రదేశాల్లో ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

నల్లగొండ: గణేష్ నిమజ్జనం జరిగే అన్ని ప్రదేశాల్లో కనీస ఏర్పాట్లు చేయాలని, గ్రామాలు, మండలాల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్లు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండలాల ప్రత్యేకాధికారులు, మండల స్థాయి అధికారులు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్డీఓలు, డీఎస్పీలు సంబంధిత అధికారులు, సిబ్బందితో మరోసారి సమావేశం నిర్వహించి, వినాయక నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ.. ఆర్డీఓలు, డీఎస్పీలు, పోలీసు అధికారులు గణేష్ నిమజ్జనం జరిగే ప్రాంతాలను సందర్శించి అన్ని ఏర్పాట్లను పరిశీలించాలని చెప్పారు. అదేవిధంగా చిట్యాలలో పాఠశాల ఉపాధ్యాయుల మధ్య సమన్వయం లేకపోవడంతో సంబంధిత హెడ్‌మాస్టర్‌కు మెమో జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చందంపేట మండలం పోలేపల్లిలో పంచాయతీ సెక్రటరీ అందుబాటులో లేకపోవడంతో సస్పెండ్ చేయాలని సూచించారు. గుర్రంపోడు ఎంపీడీఓ కంపోస్ట్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను ఆయనకు మెమో జారీ చేయాలని జెడ్పీ సీఈఓను ఆదేశించారు. అవెన్యూ ప్లాంటేషన్ సరిగా లేకపోవడం, ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్ సైతం సరిగా లేనందుకు వేములపల్లి ఎంపీడీఓకు, ఎంపీఓకు మెమో జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మిర్యాలగూడ నుంచి సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో మూడు చోట్ల గణేష్ నిమజ్జనానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డెయిరీ ఎన్నికల్లో క్యాంప్ రాజకీయం

మద్దతుదారులను శిబిరానికి తరలించిన కాంగ్రెస్

- ఈనెల 13న డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు
- అదే రోజు నేరుగా పోలింగ్ కేంద్రాలకు రానున్న పాల సొసైటీ చైర్మన్లు
- రసవత్తరంగా మదర్ డెయిరీ రాజకీయం



సాక్షి, యాదాద్రి : ఉమ్మడి నల్లగొండ– రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల (మదర్ డెయిరీ) సంఘం ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఆరు డైరెక్టర్ల స్థానాలకు జరుగుతున్న ఎన్నికలను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. డెయిరీ పీఠాన్ని ఎలాగైనా హస్తగతం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్న కాంగ్రెస్.. క్యాంపు రాజకీయానికి తెరలేపింది. తమ మద్దతుదారులను క్యాంప్‌నకు తరలించింది. కాగా మదర్ డెయిరీలో ఆరు డైరెక్టర్ స్థానాలకు గాను ఈనెల 13న ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఉమ్మడి నల్లగొండ పరిధిలో నాలుగు, రంగారెడ్డి జిల్లాలో రెండు డైరెక్టర్ స్థానాలు ఉండగా 12 మంది పోటీ పడుతున్నారు. 297 మంది పాల సొసైటీ చైర్మన్లు ఓటర్లుగా ఉన్నారు.

చైర్మన్ పీఠమే లక్ష్యంగా కాంగ్రెస్..

మదర్ డెయిరీ ఎన్నికలను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మెజార్టీ డైరెక్టర్లను గెలిపించుకుని డెయిరీ పీఠాన్ని దక్కించుకోవాలన్న లక్ష్యంతో పావులు కదుపుతున్నారు. అందులో భాగంగా కాంగ్రెస్ తన మద్దతుదారులను సోమవారం సాయంత్రం క్యాంపునకు తరలించింది. రంగారెడ్డి జిల్లా బొంగుళూరులోని ఓ ఫాంహౌజ్‌లో క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. క్యాంపులో ఉన్న పాలసొసైటీ చైర్మన్లను ఈనెల 13న హయత్‌నగర్ ఆర్టీసీ కాలనీలోని ఎస్‌వీ కన్వెన్షన్‌కు తరలించనున్నట్లు తెలుస్తోంది. అదే రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్ జరుగుతుంది.

బరిలో ఉన్నది వీరే..

ఆరు డైరెక్టర్ స్థానాలకు గాను ఉమ్మడి నల్లగొండ నుంచి ఎనిమిది మంది పోటీలో ఉన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి నలుగురు బరిలో నిలిచారు. కాంగ్రెస్ నుంచి గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, పుప్పాల నర్సింహులు, బత్తుల నరేందర్‌రెడ్డి, కల్లెపల్లి శ్రీశైలం, బీఆర్ఎస్ తరఫున సందిల భాస్కర్, ఎం.కొండల్ రెడ్డి, ఒగ్గు భిక్షపతి, డి.సోమిరెడ్డి బరిలో నిలిచారు. రంగారెడ్డి జిల్లాలో ఏ.నర్సింహారెడ్డి, ఎం.జంగయ్య, ఏ.రాంరెడ్డి, పి.గణేష్ పోటీలో ఉన్నారు.

పట్టువీడకుండా బీఆర్ఎస్..

మొన్నటి వరకు బీఆర్ఎస్ చేతిలో ఉన్న మదర్ డెయిరీ పీఠాన్ని నిలుపుకోవాలన్న పట్టుదలతో బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకెళ్లోంది. తమ అభ్యర్థుల గెలుపు బాధ్యతలను డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తన భుజాలపై వేసుకున్నారు. గత డైయిరీ ఎన్నికల అనుభవం, పాల సొసైటీ చైర్మన్లతో ఉన్న పరిచయాలను తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారితో ఫోన్ల ద్వారా సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ఎన్ని ఎత్తులు వేసినా తమ పార్టీ డైరెక్టర్లు గెలుస్తారన్న ధీమాతో గొంగిడి మహేందర్ రెడ్డి ఉన్నారు.

పునరావాస కల్పనపై ప్రజాభిప్రాయ సేకరణ

చందంపేట: మండలంలోని పొగిళ్ల గ్రామం పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉండడంతో ఆ గ్రామస్తులకు వేరే ప్రదేశంలో పునరావాసం కల్పించేందుకు మంగళవారం అటవీశాఖ అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రతి కుటుంబానికి ఐదెకరాల భూమిని కేటాయించాలని, పట్టా భూములు ఉన్న రైతులకు గ్రామంలో ఎన్ని ఎకరాల భూమి ఉంటే అన్ని ఎకరాల వ్యవసాయ భూమిని పునరావాసం కల్పించే ప్రదేశంలో ఇవ్వాలని, పక్కా ఇళ్లు, పాఠశాల, వైద్యశాల, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులు కృష్ణా బ్యాక్ జలాల నుంచి స్వతహాగా రూ.లక్షలు ఖర్చు చేసి పైపులైన్లు వేసుకున్నామని, పరిహారాన్ని అందించాలన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్, మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, రవి, రాము, వెంకటయ్య, మైబెల్లి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు

సీఐ నరేష్ సస్పెన్షన్

- గతంలో నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన నరేష్
- బీమా ఏజెంట్‌కు లబ్ధి చేకూరేలా కోర్టుకు తప్పుడు నివేదిక ఇవ్వడంతో సస్పెన్షన్

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా పనిచేసిన నరేష్ మంగళవారం సస్పెన్షన్‌కు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో సీఐడీ విభాగంలో సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో వన్‌టౌన్ ఎస్ఐగా పని చేసిన సమయంలో మునుగోడు రోడ్డులోని హౌజింగ్ బోర్డు కాలనీలో చల్లా సైదులు అనారోగ్యంతో మృతి చెందగా అతడి సోదరుడు ఎల్ఐసీ ఏజెంట్ కావడంతో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి బీమా లబ్ధి పొందారు. ఈ విషయమై అప్పటి ఎస్ఐగా పనిచేసిన నరేష్ ఏజెంట్‌కు అనుకూలంగా చార్జ్‌షీట్ వేసి, కోర్టుకు తప్పుడు నివేదిక ఇచ్చారు. గతంలో నకిరేకల్‌లో కూడా బీమా ఏజెంట్లకు లబ్ధి జరిగేలా పని చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కోర్టు ఆదేశాల మేరకు సీఐ నరేష్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- డీఈఓ భిక్షపతి



హాలియా: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకుంటున్న డీఈఓ

హాలియా: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని డీఈఓ భిక్షపతి అన్నారు. అనుముల మండలంలోని కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, చల్మారెడ్డి గూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న విద్య, మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు దాస వెంకన్న, ప్రకాశ్, సరిత తదితరులున్నారు.

త్రిపురారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. మంగళవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని టీఎస్ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలను ఆయన తనిఖీచేసి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీ నాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భూరుగు నిర్మల, కస్తూర్బా గాంధీ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి ఉన్నారు.

రుణమాఫీలో సాంకేతిక సమస్య

యాప్‌లో చూపించని రైతుల వివరాలు

- నో డేటా ఫౌండ్ అని వస్తుండడంతో ఆందోళన
- జిల్లా వ్యాప్తంగా సుమారు 3 వేలకు మందికి పైగా అందని రుణమాఫీ
- సరైన సమాధానం చెప్పని అధికారులు

నల్లగొండ మండలం గుండ్లపల్లికి చెందిన ఆవుల లక్ష్మయ్య 2018 జనవరి 18న ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు నల్లగొండ బ్రాంచ్‌లో రూ.39 వేల పంట రుణం తీసుకున్నాడు. గత ప్రభుత్వం రుణ మాఫీ పథకం కింద రూ.40,166లను ఆగస్టు 3వ తేదీ 2023లో లక్ష్మయ్య ఖాతాలో జమ చేసింది. మిగతా వడ్డీ రూ.12,300 అదే నెల 8న బ్యాంకులో చెల్లించి రుణాన్ని రెన్యువల్ చేసుకుని అదే రోజు తిరిగి రూ.48వేల పంట రుణం తీసుకున్నాడు. ప్రస్తుత ప్రభుత్వం రుణ మాఫీ చేసిన డబ్బులు రైతుకు అందలేదు. వ్యవసాయాధికారులను సంప్రదిస్తే నో డేటా ఫౌండ్ అని వస్తోందని సమాధానం చెప్పారు. వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారులు రుణ మాఫీపై స్పష్టమైన సమాధానం చెప్పకపోవడంతో రుణమాఫీ అవుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నాడు.

నల్లగొండ అగ్రికల్చర్: పంట రుణమాఫీ యాప్‌లో రైతుల వివరాలు నమోదు కాలేదన్న కారణంగా జిల్లాలో వేలాది మంది రైతులు రుణమాఫీకి నోచుకోలేదు. సుమారు 3 వేల మంది వరకు రైతులకు యాప్‌లో నో డేటా ఫౌండ్ అని వస్తోంది. దీంతో వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ రైతులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం బ్యాంకు అధికారులు సరైన రైతుల వివరాలు అందించని కారణంగానే నో డేటా ఫౌండ్ అని వస్తోందని పేర్కొంటున్నారు. బ్యాంకుల వద్దకు వెళ్లినా వారి నుంచి కూడా సరైన సమాధానం రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా.. రైతులు రుణమాఫీకి నోచుకోక ఇబ్బందులు పడుతుంటే కొందరు బ్యాంకర్లయితే రుణమాఫీ వచ్చినప్పుడు వస్తుంది కానీ తీసుకున్న రుణం చెల్లించాల్సిందే అని రైతులపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వం కుటుంబ సభ్యుల నిర్ధారణ కాక పంట రుణం అమలు కాని రైతుల వివరాలు సేకరించే పనిలో ఉంది. నో డేటా ఫౌండ్ పట్ల ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైనప్పటికీ పంట రుణమాఫీ కాకపోవడంతో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది



ప్రస్తుతం రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తోంది. ఇది పూర్తయిన తరువాత నో డేటా ఫౌండ్‌కు సంబంధించిన వివరాలను సేకరించే అవకాశం ఉంది. అందరికీ రుణమాఫీ అందుతుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతిచెందింది. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామంలో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన పల్లా సైదమ్మ(55) గ్రామంలోని గణేష్ విగ్రహం ఊరేగింపును చూసి తిరిగి సోమవారం రాత్రి 12గంటల సమయంలో అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా దామరచర్ల నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదమ్మ తల, కాళ్లు, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతురాలి పెద్ద కుమారుడు పల్లా విజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 9 మందిని చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దండుమల్కాపురం గ్రామ పరిధిలో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో అక్కడకు వెళ్లి 9 మంది పేకాట ఆడుతుండగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.26,410, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

చోరీ కేసులో నిందితురాలి అరెస్ట్

నల్లగొండ క్రైం: ఇంట్లో బంగారం చోరీ చేసిన కేసులో నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్‌హాల్ సమీపంలో నివాసముంటున్న మలాన్‌బీ ఈ నెల 8వ తేదీ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి శుభ కార్యానికి వెళ్లింది. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి వచ్చేసరికి బీరువాలో ఉన్న 9.4 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి ప్రియదర్శిని కాలనీలో నివాసముంటున్న కొత్తపల్లి ధనలక్ష్మి ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించి మంగళవారం ఆమెను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

పాముకాటుతో బాలుడు మృతి

నాంపల్లి: పాముకాటుకు గురై బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన నాంపల్లి మండలంలోని పస్నూర్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పస్నూర్ గ్రామానికి చెందిన రాపోతు రమేష్, ముత్యాలి దంపతులకు కుమారుడు గౌతమ్(7) ఉన్నాడు. రమేష్ దంపతులు అదే గ్రామానికి చెందిన ఏలుగొటి వెంకటేశ్వర్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జీతం చేస్తున్నారు. సోమవారం రాత్రి వ్యవసాయ క్షేత్రంలో వారికి కేటాయించిన గదుల్లో నిద్రిస్తుండగా.. గౌతమ్ చెవికి పాము కాటు వేసింది. గౌతమ్ ఏడ్చేసరికి తల్లిదండ్రులు నిద్ర లేచి చూడగా.. పాము కనిపించడంతో దానిని చంపేశారు. గౌతమ్‌ను దేవరకొండ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శోభన్‌బాబు పేర్కొన్నారు.

ఆశలు నింపిన 'డిండి'



డిండి ప్రాజెక్టు అలుగు నుంచి దిగువకు పోతున్న నీరు

- అలుగుపోస్తున్న ప్రాజెక్టు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు, మత్స్యకారులు

డిండి: నల్లగొండ జిల్లాలో ప్రధాన సాగునీటి వనరుల్లో ఒకటైన డిండి ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దుందుభి వాగు పరవళ్లు తొక్కుతుండటంతో డిండి ప్రాజెక్టు నిండి అలుగుపోస్తోంది. వర్షాధారం పైనే ఆధారపడిన ఈ ప్రాజెక్టు ఎగువ నుంచి వరద పోటెత్తడంతో మండల ప్రజల నుంచి ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది వానాకాలం సాగులో భాగంగా 12750 ఎకరాల ఆయకట్టుకు డిండి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. కానీ ఆగస్టు రెండో వారానికి ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉండటంతో పంట చివరి దశకు నీరందదేమోనని ఆయకట్టు రైతులు ఆందోళనకు గురయ్యారు. రైతుల వినతుల మేరకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండిని నింపి చివరి దశకు సాగు నీరందించాలని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇది ఇలా ఉండగా ఆగస్టు చివరి వారంలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో వానాకాలంతో పాటు యాసంగి పంటకు కూడా సాగు నీరందుతుందని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులకు చేతినిండా పని..

చేపల వేటనే జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న దాదాపు 500 మత్స్యకార కుటుంబాలకు చేతినిండా పని దొరకనుంది. గత నెలలో ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పదని మత్స్యకారులు ఆందోళన చెందారు. ఇటీవల కురిసిన వర్షాలకు దుందుభి వాగు దిగువకు పోటెత్తడంతో ఒక్క రోజులోనే డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తోంది. తమకు పనిదొరుకుతుందని మత్స్యకారులు సంతోషపడుతున్నారు.

పంట ఎండిపోతుందనుకున్నాం



ఆగస్టు చివరి వారం వరకు డిండి ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉండడంతో చివరి దశ వరకు నీరు సరిపోక పంట ఎండిపోతుందని ఆందోళనకు గురయ్యాం. ఈ క్రమంలోనే వర్షాలు సమృద్ధిగా కురవడంతో డిండి ప్రాజెక్టు అలుగు పోస్తుండడంతో ఆనందంగా ఉంది.

– బద్దెల బచ్చులు, రైతు

వలస వెళ్లే బాధ తప్పింది



డిండి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో మరో ఏడాది పాటు మత్స్యకారులకు చేతినిండా పని దొరుకుతుంది. దీంతో మా మత్స్యకార కుటుంబాలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే బాధ తప్పింది.

– నూకం చంద్రయ్య, మత్స్యకారుడు

మూసీ ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

- రెండు గేట్ల ద్వారా దిగవకు నీటి విడుదల



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకుపోతున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గింది. మంగళవారం 2611 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. దీంతో రెండు క్రస్ట్ గేట్లను పైకి ఎత్తి 1269 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల నిలిపి వేశారు. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో మంగళవారం సాయంత్రానికి 642.90 అడుగుల మేర నీరు ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.92 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టుఅధికారులు తెలిపారు..

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి



ప్రకాష్ (ఫైల్)

శాలిగౌరారం: విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న ఆర్టీసీ కండక్టర్ మార్గమధ్యలో గుండెపోటుతో మృతిచెందాడు. శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన వైద్యుల ప్రకాష్(50) సూర్యాపేట డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకొని నకిరేకల్ నుంచి తన బైక్‌పై వల్లాలకు వెళ్తుండగా.. గ్రామ సమీపంలోకి రాగానే ఛాతిలో నొప్పి రావడంతో బైక్‌ను రోడ్డు పక్కన నిలిపి ఇంటి వద్ద ఉన్న తన కుమారుడికి ఫోన్ చేసి చెప్పాడు. ఆ వెంటనే రక్తంతో కూడిన వాంతులు చేసుకొని కిందపడిపోయాడు. సమీపంలో ఉన్న యువకులు ప్రకాష్ వద్దకు వచ్చి నీటిని అందించేందుకు ప్రయత్నిస్తుండగానే అతడి కుటుంబ సభ్యులు వచ్చి బైక్‌పై నకిరేకల్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రకాష్ మృతిచెందిన విషయం తెలుసుకున్న సూర్యాపేట డిపో మేనేజర్ డి. సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ బి. సైదులు, ఏడీసీలు బి. సైదులు, ఎం. భాస్కర్‌లు వల్లాల గ్రామానికి చేరుకొని ప్రకాష్ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

చిట్యాల: పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన దాసరి నర్సింహ, అతడి భార్య పార్వతమ్మ పని నిమిత్తం చిట్యాల పట్టణానికి వచ్చారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ పార్వతమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని..

డిండి: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎడ్ల గడ్డతండాకు చెందిన మూడావత్ రమేష్ పని నిమిత్తం బైక్‌పై డిండి మండల కేంద్రానికి వచ్చాడు. పని ముగించుకొని తండాకు వెళ్లే క్రమంలో బస్టాండ్ వైపు నుంచి రోడ్డు అవతలికి వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేష్ తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి లారీ బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



లారీ క్యాబిన్‌లో ఇరుక్కున్న రాజ్‌కుమార్

నూతనకల్: లారీ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నూతనకల్ మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కేంద్రం నుంచి తమిళనాడు రాజధాని చెన్నైకి మిరపకాయల లోడ్‌తో బయల్దేరిన లారీ(ఏపీ 20 టీబీ 6141) నూతనకల్ మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయ సమీపంలో అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో విద్యుత్ స్తంభం నేలకూలింది. లారీ డ్రైవర్ ముత్యాల రాజ్‌కుమార్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు జేసీబీ సహాయంతో లారీ డ్రైవర్‌ను బయటకు తీసి 108 వాహనంలో సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

దొంగలుగా భావించి చితకబాదిన గ్రామస్తులు



గాయపడిన యువకులు

భూదాన్‌పోచంపల్లి: దొంగలనుకొని యువకులను గ్రామస్తులు చితకబాదిన ఘటన మంగళవారం పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్‌కు చెందిన సత్తిరెడ్డి తన కారులో చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ గ్రామానికి చెందిన గరిగె లక్ష్మీనారాయణ, పగడాల ప్రకాశ్, పాపగల్ల లింగస్వామితో కలిసి బీబీనగర్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో పోచంపల్లి మండలం దోతిగూడెం మీదుగా వెళ్తూ అదే గ్రామంలో సత్తిరెడ్డికి తెలిసిన యాట లింగస్వామిని పరామర్శించేందుకు మంగళవారం తెల్లవారుజామున అతడి ఇంటికి వెళ్లారు. లింగస్వామి ఇంటి పక్కనే ఉంటున్న దాయాది యాట నరేశ్ చీకట్లో యువకులను గమనించి దొంగలుగా భావించి కేకలు వేశాడు. దీంతో సమీపంలోని గణేశ్ మండపాల వద్ద నిద్రిస్తున్న కొందరు యువకులు పరుగెత్తుకొని వచ్చి ముగ్గురు యువకులను చితకబాదారు. 100 నంబర్‌కు డయల్ చేశారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన గరిగె లింగస్వామిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసుల విచారణలో వచ్చిన యువకులు దొంగలు కాదని తేలింది.

సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన యువకుడు



గోవిందరెడ్డికి సీపీఆర్ చేస్తున్న భాగ్యరాజ్

హుజూర్‌నగర్: స్కూటీపై వెళ్తూ స్పృహ తప్పి రోడ్డుపై పడిపోయిన వ్యక్తికి ఓ యువకుడు సీపీఆర్ చేయడంతో స్పృహలోకి వచ్చాడు. ఈ సంఘటన చింతలపాలెం మండలం దొండపాడులో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దొండపాడుకు చెందిన అన్నపురెడ్డి గోవిందరెడ్డి చింతలపాలెం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా.. స్పృహ తప్పి రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న డేరంగుల భాగ్యరాజ్ రోడ్డుపై పడి ఉన్న గోవిందరెడ్డిని తట్టి లేపగా అతడు లేవలేదు. వెంటనే గోవిందరెడ్డికి భాగ్యరాజ పది నిమిషాల పాటు సీపీఆర్ చేయగా అతడు స్పృహలోకి వచ్చాడు. వెంటనే అతడిని సమీపంలో ఉన్న జువారి సిమెంట్స్ వారి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన తర్వాత మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కోదాడకు తరలించారు. గోవిందరెడ్డి బంధువులు కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. అతడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సీపీఆర్ చేసి గోవిదరెడ్డి ప్రాణాలు కాపాడిన జయరాజ్‌ను పలువురు అభినందించారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక



గణేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నాగార్జునసాగర్: ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సమైక్యత శిబిరానికి నాగార్జునసాగర్‌లోని బీసీ గురుకుల కళాశాలకు చెందిన ఆర్. గణేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గణేష్ ఈ నెల 17వ తేదీ నుంచి 23వ తేదీ వరకు కర్ణాటక రాజధాని బెంగళూరులో నిర్వహించనున్న ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గణేష్‌ను కళాశాల ఆర్‌సీఓ, కార్యదర్శి అభినందించారు.

ఇతర రాష్ట్రాలకు మోడల్ తెలంగాణ

- 16వ ఆర్థిక సంఘం సభ్యుల కితాబు
- భువనగిరి మండలం అనంతారంలో పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న 16వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ నారాయణ ఝూ

భువనగిరి రూరల్ : తెలంగాణ పల్లెల్లో జరుగుతున్న అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తుందని 16వ ఆర్థిక సంఘం సభ్యులు పేర్కొన్నారు. భువనగిరి మండలం అనంతారంలో మంగళవారం ఆర్థిక సంఘం సభ్యులు అజయ్ నారాయణ ఝూ, మనోజ్ పాండ, జాయింట్ సెక్రెటరీ కేకే. మిశ్రా, జాయింట్ డైరెక్టర్ దావిందర్ చోడా, డిప్యూటీ డైరెక్టర్ అభిషేక్‌నందన్, అసిస్టెంట్ డైరెక్టర్ భద్‌బేష్ హజారిక పర్యటించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత పల్లెదవాఖానను సందర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ×స్వచ్ఛదనం– పచ్చదనం° పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు సవ్యంగా ఉన్నట్లు కితాబునిచ్చారు. దేశంలో విద్య, వైద్య రంగాల్లో సేవలు ఇంకా మెరుగుపడాల్సి అవసరం ఉందని, గ్రామ పంచాయతీలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేస్థాయికి ఎదగాలన్నారు.

జిల్లా ప్రాశస్త్యం వివరించిన కలెక్టర్

యాదాద్రి భువనగిరి జిల్లా చారిత్రక, సాంస్కృతిక ప్రాశస్త్యాన్ని కలెక్టర్ హనుమంతు కె. జెండగే ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు అజయ్ నారాయణ్ ఝూకు వివరించారు. యాదగిరిగుట్ట, కొలనుపాక దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఖ్యాతిగాంచాయని, పోచంపల్లిలోని చేనేత కార్మికులు, చేనేత రంగం ప్రపంచ ప్రసిద్ధిగాంచిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి క్రిస్టినా చోంగ్తు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ శాఖ కమిషనర్ అనితారామచంద్రన్, యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్, జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, డీఈఓ, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో కమిషన్ సభ్యుల పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని ఫైనాన్స్ కమిషన్ సభ్యులు అజయ్ నారాయణ్ ఝూ, డా. సౌమ్య కాంతి ఘోష్, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శుల బృందం మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వీరికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠ అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేయగా.. ఈఓ భాస్కర్ రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణం

చిట్యాల: మద్యానికి బానిసైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చిట్యాల మండలంలోని చిన్నకాపర్తి గ్రామ పంచాయతీలో మంగళవారం జరిగింది. చిట్యాల ఎస్ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకాపర్తి గ్రామానికి చెందిన తిరందాసు వెంకటయ్య(50) గత కొంతకాలంగా మద్యానికి బానిసగా మారాడు. మంగళవారం మద్యం తాగటానికి కుటుంబ సభ్యులను డబ్బులు అడగగా.. వారు ఇవ్వకపోవటంతో మనస్తాపానికి గురైన వెంకటయ్య గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగి వాంతులు చేసుకున్నాడు. అక్కడే ఉన్న చుట్టుపక్కల రైతులు గమనించి వెంకటయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం వెంకటయ్యను నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సిరుల.. విరులు

- బంతి సాగుతో అధిక ఆదాయం
- మిరప, పత్తి చేన్లలో రక్షణ పంటగా వేసుకోవచ్చు
- హార్టికల్చర్ అధికారి మురళి



పెద్దవూర మండలంలో సాగవుతున్న బంతి

పాడిపంట

పెద్దవూర: బంతి పూల సాగును మొదటగా జూన్, జూలై, అక్టోబర్, నవంబర్ నెలల్లో సాగు చేసేవారు. కానీ గత కొన్నేళ్లుగా రైతులు ఏడాది పొడవునా బంతి పూలు సాగు చేస్తున్నారు. రైతులు తమకు ఉన్న నీటి వసతిని బట్టి బంతిని సాగు చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చునని హార్టికల్చర్ అధికారి మురళి చెబుతున్నారు. బంతి సాగులో ఆయన సలహాలు, సూచనలు..

- **ఆఫ్రికన్ మేరీగోల్డ్:** ఈ జాతి బంతి మొక్కలు ఎత్తుగా పెరిగి అతిపెద్ద సైజు పూలు పూస్తాయి. దీనిలో ఆఫ్రికన్ జెయింట్, ఆరెంజ్ డబుల్, ఆఫ్రికన్ ఎల్లోజెయింట్ డబుల్, క్రాక్ జాక్, గోల్డెన్ ఏజ్ రకాలు అనువైనవి.
- **ఫ్రెంచి మేరీగోల్డ్:** ఈ జాతి బంతి మొక్కలు పూలకుండీల్లో పెంచుకునే పొట్టి రకాలు. దీనిలో రెడ్ బ్రోకేడ్, రెస్టిన్ రెడ్, బట్టర్ స్కాచ్, వాలెన్సియా రకాలు అనువైనవి.
- **నేలలు:** నీరు త్వరగా ఇంకిపోయే తేలికపాటి సారవంతమైన నేలలు, ఇసుక నేలలు, నీటి తేమ తక్కువగా ఉండే నేలలు బంతి సాగుకు అనుకూలం. బంతిని మిరప, పత్తి పంటల్లో రక్షణ పంటగా కూడా సాగు చేసుకోవచ్చు.
- **వాతావరణం:** మన వాతావరణ పరిస్థితులు బంతి సాగుకు అనుకూలం. జూలై మధ్య కాలం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు నాటితే మార్కెట్‌కు పూల సరఫరా సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు చేయవచ్చు.
- **నారుమళ్లు:** ఎకరానికి సరిపడా బంతి నారు పెంచడానికి 800–1000 గ్రాముల విత్తనం అవసరం. మడులు తయారు చేసుకునే సమయంలో ఒక చదరపు మీటరుకి 8–10 కిలోలు బాగా చిలికిన పశువుల ఎరువు వేయాలి. విత్తడానికి మొదలు ఫాలిడాల్ పొడి చల్లితే చీమలు, చెదలు వంటి ఇతర క్రిముల నుంచి రక్షణ పొందవచ్చు. ఎత్తు నారుమళ్లు చేసుకుని విత్తనాన్ని సాళ్లలో నాటుకుంటే మొక్కల మధ్యదూరం సమంగా ఉండి నారు మొక్కలు ఏపుగా పెరుగుతాయి. దీనివలన కలుపు మొక్కలు, చీడపీడల నివారణ కూడా వీలవుతుంది. విత్తిన 5–7 రోజుల్లో మొలకలు వస్తాయి.
- **నాటే విధానం:** 15–20 రోజుల వయసు లేదా 3–4 ఆకులు వచ్చిన మొక్కలను 45×25 సెంటీమీటర్ల దూరంలో నాటితే మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండి పూల దిగుబడి పెరుగుతుంది. నారుని సాయంకాలం నాటుకుంటే బాగా పాతుకుంటాయి. ఆఫ్రికన్ మొక్కల్ని 40×30 సెంటీమీటర్ల దూరంలోనూ, ఫ్రెంచ్ బంతి మొక్కల్ని 20×20 సెంటీమీటర్ల దూరంలో నాటితే పూల దిగుబడి బాగా ఉంటుంది. నాటిన తర్వాత పల్చగా నీరు పెట్టుకోవాలి.
- **ఎరువులు:** ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 టన్నుల చొప్పున బాగా చిలికిన పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. వీనితోపాటు 20–40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 35 కిలోల పొటాష్‌ను ఇచ్చే ఎరువులను వేయాలి. మొక్కలు నాటిన 60 రోజుల వరకు శాఖీయంగా పెరిగే దశలో ఉంటాయి. ఈ సమయంలో తగినంత తేమ ఉండేలా చూడాలి. నేల స్వభావాన్ని బట్టి 5–8 రోజుల వ్యవధిలో నీరు కట్టాలి.
- **కత్తిరింపులు:** వాణిజ్యపరంగా పెంచే ఆఫ్రికన్ బంతి రకాలు ఎత్తుగా పెరిగి చాలా తక్కువగా పూలు వస్తాయి. కనుక మొక్కలు 30–40 సెంటీమీటర్ల ఎత్తులో లేదా నాటిన 30–35 రోజులకు తలభాగం కత్తిరిస్తే మొక్క కింది భాగం నుంచి పక్క కొమ్మలు ఎక్కువగా వచ్చి పూల దిగుబడి పెరుగుతుంది. అంతేకాకుండా మొక్కలకు వచ్చిన పూలన్నీ ఒకే పరిమాణంలో ఉండి మంచి రంగు సంతరించుకోవడంతో గిరాకీ కూడా ఎక్కువగా ఉంటుంది.

తెగుళ్లు–సస్యరక్షణ చర్యలు:

- **నారుకుళ్లు తెగులు:** నేలలో తడి ఎక్కువగా ఉండి వెచ్చని వాతావరణంలో ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. మొలకెత్తిన నారు మొక్కల కాండం కుళ్లి చనిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల కాప్టాన్ లేదా 1.5 గ్రాముల కార్బండిజమ్ కలిపిన మందు ద్రావణంతో నారు మడిని తడిపి నివారించవచ్చును.
- **మొగ్గ తొలిచే పురుగు:** లార్వాలు పూల మొగ్గలను తొలుస్తాయి. దీంతో పూల మొగ్గలు విచ్చుకోవు. పూల దిగుబడి బాగా తగ్గుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల కార్బరిల్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- **పేను:** పెద్ద, పిల్ల పురుగులు మొగ్గల్ని ఆశించి నష్టపరుస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు మలాథియాన్ లేదా 2 మిల్లీలీటర్లు డైమిథోయేట్ కలిపి 15రోజుల వ్యవధిలో పిచికారీ చేసి నివారించుకోవచ్చు.
- **తామర పురుగులు:** పిల్ల, తల్లి పురుగులు ఆకులు, పూల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఆకుల మీద తెల్లని మచ్చలు కనిపిస్తాయి. ఇవి ఆశించిన పూ మొగ్గలు గోధుమరంగుకు మారి ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు డైమిథోయేట్‌ను కలిపి పిచికారీ చేయాలి.